
తుర్కకాశీకాలనీలో
తాగునీటి గోస
- బోరుబావిలో అడుగంటిన నీళ్లు
అభివృద్ధి పనులతోనే
కాంగ్రెస్‌లో చేరికలు
8





ఎండలోనే 'ఉపాధి'

- పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువు
- ఈసారీ సమ్మర్ అలవెన్స్ దూరమే
- రెండేళ్లుగా వేసవి భత్యానికి మంగళం
- కేంద్ర అజమాయిషీలోనే ఉపాధిహామీ పనులు
- ఎన్ఐసీ సాఫ్ట్‌వేరే కారణమా?
- జిల్లాలో యాక్షన్ ప్లాన్ సిద్ధం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అప్పుడే ఎండలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. గతంలో కంటే ముందుగానే భగ్గుమంటున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో పని స్థలాల్లో కనీస సౌకర్యాలు లేక ఉపాధిహామీ కూలీలు మాడిపోతున్నారు. గతంలో ఉపాధిహామీ కూలీలకు పనిప్రదేశంలో టెంట్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించారు. వేసవిలో ఎండల్లో పనిభారం తగ్గించడానికి గతంలో ప్రభుత్వం ఐదు నెలలపాటు సమ్మర్ అలవెన్స్ అందించేది. రేండేళ్లుగా సమ్మర్ అలవెన్స్‌కు మంగళం పాడారు. కొత్త సాఫ్ట్‌వేర్‌తోనే ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ దూరమయ్యిందా? అనే చర్చ మొదలైంది. మరోవైపు దేశంలో వేసవి ప్రభావం వివిధ ప్రాంతాల్లో వేర్వేరుగా ఉండడంతోనే 2022 సంవత్సరం నుంచి దేశమంతా ఒకే విధానం ఉండాలనే భావనతో సమ్మర్ అలవెన్స్‌కు మంగళం పాడినట్లు తెలుస్తోంది. ప్రతీ వేసవి కాలంలో ఐదు నెలలపాటు సమ్మర్ అలవెన్స్ అందించేవారు. ఉపాధిహామీలో పారదర్శకత పెంపొందించే దిశగా కేంద్ర, గ్రామీణాభివృద్ధి సంస్థ తన అజమాయిషీలోనే పనుల నిర్వహణ చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించే టీటీఏ సాఫ్ట్‌వేర్‌ను తొలగించారు. నేషనల్ ఎన్‌ఫార్మెటిక్ సెంటర్ సర్వర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. అంతేకాకుండా సాంకేతికతను ఉపయోగిస్తూ పని జరిగే చోటు నుంచే వివరాలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్న కొత్త సాఫ్ట్‌వేర్‌లో సమ్మర్ అలవెన్స్ ఆప్షన్ లేకపోవడంతో వేసవి భత్యాన్ని ఉపాధిహామీ కూలీలు కోల్పోతున్నారు. మండుటెండలో అనేక అవస్థలు పడుతూ పనిచేసే కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా లేకపోగా కొంత ఊరటను ఇచ్చే సమ్మర్ అలవెన్స్ కూడా దూరమైంది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్‌ల కింద ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం, జూన్‌లో 20 శాతం సమ్మర్ అలవెన్స్ అందించే వారు. రాష్ట్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ ద్వారా పనుల ప్రకారం సమ్మర్ అలవెన్స్‌ను జమ చేసేవారు. కేంద్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌లో ఆ అవకాశం లేకపోవడంతో కూలీలు నష్టపోతున్నారు. సాఫ్ట్‌వేర్ కారణంగా అలవెన్స్ 2022లో ఇవ్వలేకపోయారని భావించిన గతేడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అలవెన్స్ అందించడం లేదు.

ఉపాధి ప్రణాళిక సిద్ధం

గ్రామీణులకు ఉపాధిని అందిస్తున్న ప్రధానమైన కేంద్ర ప్రభుత్వ పథకం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం దీని ద్వారా గ్రామాల్లోని కూలీలు వలసలు వెళ్లకుండా నియంత్రిస్తూ వారికి ఉన్న గ్రామంలోనే ఉపాధిని అందించడానికి పనులు చేపడుతున్నారు. జిల్లాలో ఉపాధిహామీ పథకంలో 97 వేల జాబ్ కార్డులు ఉండగా కూలీలు 1.98 లక్షల మంది ఉన్నారు. జిల్లాలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనిదినాలు కల్పించడానికి యాక్షన్ ప్లాన్ పూర్తి చేశారు. పనులను గుర్తించి కూలీల బడ్జెట్ రూపకల్పనలో జిల్లాలోని 255 గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి పనులను గుర్తించారు. గతంలో ఉపాధి పనులు ఇష్టానుసారంగా జరిగిన క్రమంలో కేంద్ర ప్రభుత్వం పాత విధానానికి స్వస్తి పలికి కొత్త విధానాన్ని ముందుకు తీసుకొచ్చింది. ఉపాధి పనులపై సామాజిక తనిఖీలతో కేంద్రం పూర్తిగా నిఘాను పెంచింది. ఇప్పటికే నేషనల్ ఇన్‌ఫ్మరెటిక్ సెంటర్ ఎన్ఐసీ సర్వర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధిహామీ కూలీలకు నేరుగా వారి ఖాతాల్లోనే కూలి డబ్బులను నేరుగా జమ చేస్తోంది. 2024- 2025 సంవత్సరానికి 27 లక్షల 55 వేల 773 పనిదినాలు కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఏప్రిల్‌లో 4,06,188 పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. మే వరకు 8,28,737 పనిదినాలు, జూన్ వరకు 10,93,321 పనిదినాలు, జూలై వరకు 12,24,197 పనిదినాలు, ఆగస్టు వరకు 13,38,739 పనిదినాలు, సెప్టెంబరు వరకు 14,48,308 పనిదినాలు, అక్టోబరు వరకు 15,65,972 పనిదినాలు, నవంబరు వరకు 17,06,216 పనిదినాలు, డిసెంబరు వరకు 18,73,535 పనిదినాలు, జనవరి వరకు 20,82,249 పనిదినాలు, ఫిబ్రవరి వరకు 23,73,158 పనిదినాలు, మార్చి వరకు పూర్తిగా 27,55,773 పనిదినాలు లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా యాక్షన్‌ప్లాన్ రూపొందించారు. బోయినపల్లి మండలంలో 1,62,160 పనిదినాలు, చందుర్తిలో 2,61,201, ఇల్లంతకుంటలో 2,62,738, గంభీరావుపేటలో 3,66,711, కోనరావుపేటలో 3,28,709, ముస్తాబాద్‌లో 2,75,592, రుద్రంగిలో 68,568, తంగళ్లపల్లిలో 3,20,100, వీర్నపల్లిలో 2,10,000, వేములవాడలో 55,350, వేములవాడ రూరల్‌లో 1,45,700, ఎల్లారెడ్డిపేటలో 2,98,944 పనిదినాలు కల్పించే లక్ష్యంగా పెట్టుకున్నారు.

బార్ అసోసియేషన్‌లో

ఎన్నికల సందడి

- ముగిసిన నామినేషన్ల స్వీకరణ

సిరిసిల్ల క్రైం, మార్చి 20: సిరిసిల్ల బార్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి నెలకొంది. నామినేషన్‌ల స్వీకరణకు బుధవారం చివరి రోజు కావడంతో అసోసియేషన్ హాలులో కోలాహలం కనిపించింది.. రెండు స్థానాలు మినహా మిగతా అన్నింటికి న్యాయవాదులు పోటాపోటీగా నామినేషన్‌లు దాఖలు చేశారు. ఈ నామినేషన్‌ల ప్రక్రియలో భాగంగా అధ్యక్ష స్థానానికి ఎస్.వసంతం, డి.సంజీవరెడ్డి, జె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్ష స్థానానికి పి.దుర్గారెడ్డి, ప్రధానకార్యదర్శి స్థానానికి వి. గోవర్ధన్‌రెడ్డి, టి. వెంకటి, జాయింట్ సెక్రెటరీ స్థానానికి బి. నాగరాజుగౌడ్, ఆడేపు వేణు, పసునూరి మధు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి స్థానానికి గుడ్ల కిషన్, మొగిలి రాజు, నర్మెట్ట రమేష్, లైబ్రరీ కార్యదర్శి స్థానానికి సురేష్ ప్రసాద్, శశాంకం, ట్రెజరీ స్థానానికి బిట్ల విష్ణు, చికట్ల వెంకటేష్, మహిళా ప్రతినిధికి మంద పుష్పలత నామినేషన్‌లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి సురభి సత్యనారాయణరావు, సహాయ ఎన్నికల అధికారి జగ్గారావులు తెలిపారు. ఉపాధ్యక్ష స్థానానికి దుర్గారెడ్డి, మహిళా ప్రతినిధికి మంద పుష్పలత ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఈ రెండు స్థానాల ఏకగ్రీవం లాంచనమే అయ్యాయి. మిగతా అన్ని స్థానాలకు ద్విముఖ, త్రిముఖ పోటీ నెలకొంది. గురువారం నామినేషన్‌ల పరిశీలన, శుక్రవారం నామినేషన్‌ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. ఈనెల 28న బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

వేములవాడలో..

వేములవాడ, మార్చి 20 : వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలలో 28 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి కే విద్యాసాగర్‌రావు వెల్లడించారు. బుధవారం నామినేషన్లు స్వీకరణ సమయం ముగిసే సమయానికి మొత్తం 28 మంది వివిధ పదవుల కోసం నామినేషన్లు అందజేశారని వివరించారు. అధ్యక్ష పదవికి గుడిసె సదానందం, వి.సుధాకర్, పి.మనోహర్, ప్రధాన కార్యదర్శి పదవికి ఎ.రజినీకాంత్, పి. భానుకృష్ణ పోటీ పడుతున్నారని తెలిపారు. వివిధ పదవుల కోసం మొత్తం 28 మంది పోటీలో ఉన్నారని, ఈనెల 28వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామని వెల్లడించారు.

రూ.50 వేల కంటే ఎక్కువ తరలిస్తే సీజ్

సిరిసిల్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆధారాలు లేకుండా రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సీజ్ చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ బృందాలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డబ్బులు, మద్యం, గిఫ్ట్ ప్యాక్‌లు సీజ్ చేసే క్రమంలో వీడియో తీయాలని సూచించారు. సీజ్ చేసిన వాటికి సంబంధించి రసీదులు అందజేయాలన్నారు. డబ్బులు తీసుకెళ్లేవారు వాటికి సంబంధించి పత్రాలు, ఆధారాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అధికారులు బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. రూ.10 వేల కంటే ఎక్కువ విలువైన వస్తువులను జీఎస్టీ బిల్లు లేకుండా తరలిస్తే సీజ్ చేయాలన్నారు. సీ విజిల్ యాప్ వినియోగం ఫిర్యాదులు వస్తే ఎంత సమయంలో చేరుకోవాలి. ఎన్ని నిమిషాల్లో క్లోజ్ చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



అభివాదం చేస్తున్న నటి ఇంద్రజ

సిరిసిల్లలో రజాకార్ సినిమా బృందం

సిరిసిల్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నిజాం రజాకార్ల నేపథ్యంలో నిర్మించిన రజాకార్ సినిమా యూనిట్ బృందం సిరిసిల్లలో సందడి చేసింది. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విమల్ థియేటర్‌లో రజాకార్ సినిమా ప్రదర్శిస్తుండగా చిత్ర యూనిట్ వచ్చింది. హైదరాబాద్ నుంచి సిరిసిల్లకు వచ్చిన ప్రముఖ నటి ఇంద్రజ, దర్శకుడు యాట సత్యనారాయణ, రాజు, అర్జున్, సహదేవ్, గిరి, సత్యనారాయణ, రమణ, శివమ్ ముందుగా సిరిసిల్లలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం విమల్ థియేటర్‌లో నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనినటి ఇంద్రజ, దర్శకుడు సత్యనారాయణ మాట్లాడుతూ రజాకార్‌లతో తెలంగాణ ప్రజలు పడిన ఇబ్బందులను సినిమాలో చూపించినట్లు చెప్పారు. మతతత్వ సినిమా కాదని గత చరిత్ర సినిమా అని అన్నారు. అంతకుముందు రజాకార్ చిత్ర యూనిట్‌ను సిరిసిల్ల బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.

కోతకు గురైన రహదారి



ప్రమాదకరంగా మారిన రోడ్డు

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని ఎల్లారెడ్డిపేట- వీర్నపల్లి ప్రధాన రహదారి గతేడాది కురిసిన భారీ వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. మరమ్మతు చేపట్టాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, కోతకు గురైన రహదారికి మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

యుద్ధ ప్రాతిపదికన రైతాంగాన్ని ఆదుకోవాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

గంభీరావుపేట, మార్చి 20: వడగళ్లవానతో నష్టపోయిన రైతులను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. బుధవారం గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నష్టపోయిన వరి పంటను పరిశీలించారు. బాధిత రైతులను పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, ప్రభుత్వం నుంచి సాయమందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకిచ్చిన హామీలన్నీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పంట నష్టపోతే తక్షణమే నష్టపరిహారం అందేలా పంటల బీమా పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు సబ్సిడీ ఇస్తామన్నారు కానీ అమలు చేయడం లేదన్నారు. రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేల సాయం అందించడం లేదన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామన్నారని, పంట నష్టపోతే వెంటనే ఎకరాకు రూ.10 వేల చొప్పున తక్షణ సాయం అందిస్తామన్నారని, కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పనికిరాదు అంతకు మించి అద్భుతమైన పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. పదేళ్లుగా రైతులు పంట నష్టపోయినా నయాపైసా సాయం చేసిన పాపాన పోలేదన్నారు. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగిలిందన్నారు. ఇంకా నిన్న అపర మేధావి ఇక్కడికి వచ్చి పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని, బీమా అందించాలని డిమాండ్ చేస్తున్నారని, ఆ పార్టీ నేతలకు మాట్లాడే నైతిక అర్హత ఉందా? అని అన్నారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ నేతలు కూడా రైతులకు అరచేతిలో స్వర్గం చూపించారన్నారు. రాహుల్ గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామన్నారని, భూమి ఉన్న రైతులతోపాటు కౌలు రైతులకు రైతు భరోసా కింద ఏటా ఎకరానికి రూ.15 వేలు, భూమిలేని ఉపాధి హామీ రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇస్తామన్నారని, ఆ హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ఎందుకు పరిహారం అందించడం లేదన్నారు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వానికి తేడా ఏముందన్నారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణ సాయంగా ఎకరాకు రూ.20 వేలు అందించాలని, యుద్ధ ప్రాతిపదికన పంట నష్టం వివరాలను తెప్పించుకొని పూర్తిస్థాయి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకాన్ని అమల్లోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, బీజేపీ రాష్ట్ర నాయకులు కొక్కు దేవేందర్ యాదవ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ రాజేందర్ రెడ్డి ఉన్నారు



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న బండి సంజయ్

ముస్తాబాద్: వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులను తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు, పోతుగల్, గన్నెవానిపల్లె తదితర గ్రామాల్లో రెండు రోజుల క్రితం కురిసిన వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలను బండి సంజయ్‌తోపాటు, పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి రుద్రమదేవి పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి పంటలు వేస్తున్నారని, లాభం కోసం పంటలు పండించే పరిస్థితి లేదని అన్నారు. రైతులకు తెలంగాణ ప్రభుత్వంలో అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గత ప్రభుత్వం రైతలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు పంట పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లారపు సంతోష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, మాజీ సెస్ ఛైర్మన్ అల్లాడి రమేశ్, మాజీ సెస్ డైరెక్టర్ కొక్కు దేవేందర్‌యాదవ్, కరెడ్ల రమేశ్‌రెడ్డి, గిరి, గోపి, పెంజర్ల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కరీంనగర్ ఎంపీ బండిసంజయ్‌కుమార్ వాహనాన్ని మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామం వద్ద ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ముస్తాబాద్ మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో మరణించిన రైతు ఎలుసాని ఎల్లయ్య కుటుంబాన్ని బండి సంజయ్‌కుమార్ బుధ వారం పరామర్శించారు. రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, మెంగని మహేందర్, రెడ్డబోయిన గోపి, మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కళ్యాణ్, రాజు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

ముస్తాబాద్ మండలంలో పోతుగల్ గ్రామానికి చెందిన కోల కృష్ణతో పాటు పలువురు బీఆర్ఎస్ నుంచి ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ కండువా కప్పుకున్నారు. గతంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వీరు తిరిగి బీఆర్ఎస్ నుంచి బీజేపీలో బండి సంజయ్ సమక్షంలో చేరారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమేష్

సిరిసిల్ల టౌన్, మార్చి 20: వచ్చే నెల 15 వరకు ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం ఓటరు అధికారి, ఆర్డీవో రమేష్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఏప్రిల్ 15లోగా ఫారం-6లో నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు వంగ అనిల్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు బుర్ర తిరుపతి, కాంగ్రెస్ నాయకుడు బి.సంపత్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించాలి



మాట్లాడుతున్న డాక్టర్ నయూమ్‌జహా

తంగళ్ళపల్లి, మార్చి 20: విద్యార్థులు శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించాలని కిరణం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ నయీమ్ జహా అన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో కిరణం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌమార దశ, శారీరక, మానసిక మార్పులు, ప్రభావాలు, వాటి నుంచి అధిగమించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఫోన్‌లో సహాయం అందించేందుకు కిరణం టోల్ ఫ్రీ నెంబర్ 18004253333ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న గిరిజనులు

వీర్నపల్లి, మార్చి 20 : వీర్నపల్లి మండలం ఎర్రగడ్డ తండా గ్రామంలో జగదాంబ దేవి ఆలయం ఎదుట గిరిజనులు ధ్వజ స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిజన పూజారి బాబు సింగ్ మహారాజ్ ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

చందుర్తిలో వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్

చందుర్తి : ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రలోభ పెట్టేం దుకు డబ్బు, మద్యం ఇతరత్రా తరలించే వారిపై నిఘాను పెంచారు. బుధవారం ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో మం డల కేంద్రంలో వేములవాడ- కోరుట్ల రహదారిపై వెళ్లే వాహ నాలను తనిఖీ చేశారు. రూ.50వేల కంటే ఎక్కువ తీసుకెళ్తే సంబంధిత పత్రాలు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లంతకుంట, మార్చి 20: ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం అధికారి వెంకటరాంబాబు అన్నారు. మండలకేంద్రంలో బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో ఓటుహక్కుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో సమాజిక కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అనిల్‌రెడ్డి, మురళి, ఎలుక జ్యోత్స్న, కావ్య రజనీ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఓటర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం అధికారి వెంకట్ రాంబాబు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజగోపాల్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



రాజయ్య(ఫైల్)

ఓదెల,మార్చి 20: మండలంలోని కనగర్తిలో బుధవారం గుండారం రాజయ్య(62) అనే కౌలు రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రాజయ్య కనగరిలోని ఆరెల్లి రాములు అనే మరో రైతు చెందిన 2.20 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. బుధవారం నీరు పెట్టేందుకు వెళ్లి పరిశీలిస్తుండగా కింద ఉన్న విద్యుత్ లైన్ తీగలు కాలికి తగిలి అక్కడికక్కడే చెందాడు. రెండు రోజుల క్రితం గాలి, దుమారానికి విద్యుత్ తీగలు తెగిపడి ఉంటాయని, ఎవరూ తొలగించకపోవడం వల్ల రాజయ్య కాలికి తగిలి దుర్మరణం చెందాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్ రెడ్డి తెలిపారు.

పెద్దపల్లిలో యువకుడు...

పెద్దపల్లిటౌన్, మార్చి 20: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. శాంతినగర్‌కు చెందిన ఒల్లెపు ఉపేందర్(23) ఓ పాత ఇల్లు కూల్చివేసే పనికి వెళ్లాడు. విద్యుత్ సర్వీస్ వైర్‌కు తగిలి ఉపేందర్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. తోటి కార్మికుడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి మూడేళ్ల కూతురు ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామడుగు, మార్చి 20: మండలంలోని వెంకట్రావ్‌పల్లిలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాకేశ్ అనే యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినిపల్లి మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన అలువాల రాకేశ్ (21), రాగుల అరవింద్ అనే యువకులు మండలంలోని గోపాల్‌రావుపేటలో పుట్టిన రోజు వేడుకలకు హాజరైనట్లు తెలిపారు. పుట్టినరోజు వేడుకలను ముగించుకొని ఇద్దరు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా వెంకట్రావ్‌పల్లి గ్రామంలోని మూలమలుపు వద్ద మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాకేశ్ మృతి చెందాడని తెలిపారు. మృతుని తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 20: మానకొండూర్‌లో బుధవారం ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..మానకొండూర్ గ్రామానికి చెందిన గొల్ల చరణ్‌తేజ్ అనే విద్యార్థి పోచంపల్లిలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువున్నాడు. స్నేహితుడి దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుండగా అన్నారం వైపు నుంచి మానకొండూర్‌కు వస్తున్న ఇసుక ట్రాక్టర్ బాలుడిని ఢీకొట్టింది. ప్రమాదంలో చరణ్‌తేజ్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

రెండు బస్సులు ఢీ : తప్పిన ప్రమాదం

గంగాధర, మార్చి 20: గంగాధరలో బుధవారం రెండు బస్సులు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో బస్సుల్లో ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు. గంగాధర బస్‌స్టేషన్ నుంచి కరీంనగర్ డిపోకు చెందిన బస్సు బయటకు వస్తోంది. హుజూరబాద్ డిపో బస్సు ప్రయాణికులతో బస్‌స్టాండుకు వెళ్తుండగా రెండు బస్సులు ఒకదానికొకటి బలంగా రాసుకున్నాయి. రెండు బస్సుల్లో ప్రయాణికులుండగా ఎవరికీ ప్రమాదం కాలేదు. విషయం తెలుసుకున్న కరీంనగర్ డీఎం, ఎస్‌ఐ కిరణ్‌రెడ్డిలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బస్సులను పరిశీలించారు.

దొంగిలించిన బైక్ లభ్యం

రామడుగు, మార్చి 20 : మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన రఘువీర్ అనే వ్యక్తికి చెందిన మోటార్‌సైకిల్ రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కాగా బుధవారం పెగడపల్లి మండలంలోని నర్సింహునిపేటలోని క్రీడా ప్రాంగణం వద్ద బైక్ ఉందన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి బైక్ తీసుకువచ్చినట్లు రఘువీర్ తెలిపారు.

ధర్మపురిలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం


పుట్ట బంగారం కోసం స్వామి వారల సేవల ఊరేగింపు


యాజ్ఞికులు కందాలై పురుషోత్తమాచార్యులను ఆహ్వానిస్తున్న ఈవో, చైర్మన్

ధర్మపురి, మార్చి 20: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేళలో మంగళవాయిద్యాలు వెంట రాగా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యుల ఇంటికి వెళ్లి ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం యాజ్ఞికులను ఆలయానికి తీసుకువచ్చారు. ఉత్సవాల కోసం ఆలయం పక్షాన ఈవో అర్చకులకు దీక్షావస్త్రాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు అంకురార్పణ, కలశ స్థాపన, ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవమూర్తులకు రక్షాబంధనం చేసిన అనంతరం నాందీముఖం, ఇదహావచనం చేసి మాతృకా పూజలు జరిపారు. స్వామి వారలకు డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, గోదావరి మహాహారతి రాష్ట్ర కో కన్వీనర్, బీజేపీ రాష్ట్ర నేత దామెర రాంసుధాకర్‌రావు పక్షాన అర్చకులు వేర్వేరుగా సొంతంగా స్వామి వారలకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

● పుట్ట బంగారం కోసం స్వామి వారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం వేళలో లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర), వేంకటేశ్వర స్వామి వారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి వరహాతీర్థం, పుట్ట బంగారం కోసం తీసుకెళ్లారు. సంప్రదాయ రీతిలో మంగళ వాయిద్యాలు వెంట రాగా స్వామి వారల ఊరేగింపు సేవలను చింతామణి చెరువు వద్ద నూతన వేదిక, టీటీడీ ధర్మశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల వద్దకు తీసుకెళ్లారు. పూజల అనంతరం అక్కడే మట్టిని తవ్వి ఆలయాలకు పుట్ట బంగారం తీసుకువచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపి స్వామివారలను దర్శనం చేసుకున్నారు. స్వామివారల సేవలను తిరిగి ఆలయాలకు తీసుకు వచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రాంనర్సింహారెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● మొదలైన భక్తుల రాక

ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవా కోసం భక్తుల రాక బుధవారం రాత్రి నుంచి మొదలైంది. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న గురువారం జరిగే లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర),వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం తిలకించే భక్తులు నెత్తి మీద ముల్లెమూట పెట్టుకుని చేరుకున్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి కాలినడకతో చేరుకున్న భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తమ ఇష్టదైవమైన లక్ష్మీనర్సింహస్వామిని కొలుస్తూ దర్శించుకున్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

ఈ నెల 21న గురువారం సాయంత్రం ఆరు గంటలకు గోధూళి సుముహూర్తమున శేషప్ప కళావేదిక పైన లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర), వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. శేషప్ప కళావేదికపై రాత్రి ఎస్‌వి శ్రీరాంభట్టార్ భాగవతార్‌చే హరికథ గానం ఉంటుందని ఆయన వివరించారు.

అక్రమంగా మద్యం, గుడుంబా రవాణాపై ఫిర్యాదుకు కంట్రోల్‌రూం

కరీంనగర్ క్రైం, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అక్రమంగా మద్యం, గుడుంబా, గంజాయి, కల్తీకల్లు దందాలపై సమాచారం లేదా ఫిర్యాదు చేసేందుకు కరీంనగర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎక్కడ అక్రమంగా మద్యం, గుడుంబా, కల్తీకల్లు, గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉన్నా ప్రజలు నేరుగా కంట్రోల్ రూం నంబర్ : 8712658804కు సమాచారం అందించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో అక్రమ మద్యం, ఇతర అక్రమ దందాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఏసీ తెలిపారు.

చెక్ పోస్ట్ వద్ద నగదు పట్టివేత

తంగళ్లపల్లి, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల చెక్‌పోస్ట్ రూ.80 వేల 400 నగదును పోలీసులు పట్టుకున్నారు. పెద్దపెల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన రాయికంటి వేణు వేములవాడకు కారులో వెళ్తుండగా జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో రూ. 80,400 స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ అధికారులు తెలిపారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట రూరల్, మార్చి 20: జమ్మికుంట మండలంలోని అంకూసపూర్ గ్రామంలో గల బెల్ట్‌షాపులపై బుధవారం పోలీస్‌లు దాడులు నిర్వహించారు. ఓదెల శ్రీనివాస్ వద్ద రూ.1400 విలువ గల మద్యం బాటిళ్లు, శామంతుల సదానందం వద్ద రూ.2600 విలువ గల మద్యం బాటిళ్లను పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ద్విచక్రవాహనం దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

తంగళ్లపల్లి, మార్చి 19: ద్విచక్రవాహనం దొంగతనం చేసిన తంగళ్లపల్లి మండలం మండపల్లి గ్రామానికి చెందిన అల్లేపు నవీన్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని ఒగులాపూర్ గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా జాతరకు వచ్చిన సిరిసిల్ల పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన పెంట శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనం పార్కు చేసి రాత్రిపూట నిద్రిస్తున్న సమయంలో చోరీకి గురైంది. దీనిపై ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఎస్‌ఐ వాహనాల తనిఖీ చేస్తుండగా దొంగిలించిన ద్విచక్ర వాహనం పట్టుబడింది. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని చోరీకి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మల్యాల, మార్చి 20: ఒంటరితనం భరించలేక ఓయువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నూకపల్లికి చెందిన సైదులు వంశీ(23)కి రెండేళ్ల క్రితం వివాహం జరగగా మనస్పర్థలతో ఏడాది క్రితం విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి వంశీ ఒంటరితనంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. బుధవారం ఉదయం వంశీ తండ్రి రాజయ్య గదిలోకి వెళ్లి చూడగా ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆర్ కృష్ణకుమార్ కేసు నమోదు చేశారు.

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్

కోరుట్ల, మార్చి 20 : బీడీ కార్మికుల సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించాలని, బీడీ టేకేదారులకు కమీషన్ పెంచే విధంగా యాజమాన్య సంఘం చర్యలు చేపట్టాలని బీడీ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా బీడీ వర్కర్స్ యూనియన్ సభ్యులకు బుధవారం నోటీసులను అందించారు. అనంతరం కోరుట్ల పట్టణంలోని సి ప్రభాకర్ భవనంలో ఏర్పాటు చేసిన బీడీ కార్మిక సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు మాట్లాడారు. నిజామాబాదు, కరీంనగర్, ఆదిలాబాదు, వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఏడు లక్షల మంది కార్మికులు చాటన్ ప్యాకింగ్ నెలవారీ ఉద్యోగులకు రెండు సంవత్సరాల వేతన ఒప్పంద కాలపరిమితి మార్చి 31తో ముగుస్తుందన్నారు. ప్రస్తుతం రోజురోజుకు ధరలు పెరిగిపోయినందున బీడిలకు మూల వేతనం రూ. 300 పెంచాలన్నారు. బీడి టేకేదారులకు కమీషన్ పెంచి వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ పెడరేషన్ సంఘం నాయకులు భానుప్రసాద్, ఎండీ ముక్రం, శ్రీనివాస్, అదే రంగారెడ్డి, అనసూయ, కొక్కుల శాంత, శంకర్, మల్లారెడ్డి, రవి వెంకన్న, సాంబయ్య, నరసయ్య, భూమయ్య, రాజేశం, లక్ష్మణ్, పరందాం, రమేష్, లింగం, బాపురావు, శంకర్, శేఖర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


బీడీ యజమానుల సంఘ నాయకులకు నోటీసులు అందిస్తున్న ఏఐటీయుసీ నాయకులు

ఫలించిన మొగిలిపేట రైతుల భగీరథ ప్రయత్నం


గంగనాల ప్రాజెక్ట్ వద్ద బండరాళ్లను తొలగిస్తున్న రైతులు


మొగిలిపేటకు చేరుకున్న గంగనాల ప్రాజెక్టు నీరు

మల్లాపూర్, మార్చి, 20: మండలంలోని మొగిలిపేట గ్రామానికి గంగనాల ప్రాజెక్ట్ నీరు తీసుకరావడానికి రైతులు నలభై రోజులగా భగీరథ ప్రయత్నం చేసి సాధించుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని గంగనాల ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా వచ్చే నీరుతోనే గ్రామంలోని పంటల సాగు జరుగుతుంది. కానీ గత కొంత కాలం నుంచి గ్రామానికి తాగు, పంట సాగుకు ఇబ్బందులు ఏర్పడి పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయి. గంగనాల ప్రాజెక్ట్ నీరు వస్తేనే గ్రామంలో సమస్యలు తీరుతాయని రైతులు భావించారు. దీంతో ప్రాజెక్ట్ నుంచి గ్రామానికి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక గ్రామంలోని రైతులు అంతా ఒక్కటై గంగనాల ప్రాజెక్ట్ నుంచి నీరు తీసుకరావడానికి పూనుకున్నారు. గంగనాల ప్రాజెక్ట్ వద్ద పూడిక పనులు చేయకుంటే నీరు సరఫరా కాదని భావించారు. రైతులందరూ కలిసి నలభై రోజులుగా భగీరథ దీక్షలాగా పనులు చేపట్టారు. ప్రాజెక్ట్‌లోని మట్టిని, రాళ్లను తొలగించడమే కాకుండా కాలువ వెంట పెరిగిన పిచ్చి మొక్కలు, పూడిత తీత పనులు చేశారు. వారి ప్రయత్నం ఫలించి కాలువ ద్వారా గ్రామంలోని చెరువులోకి నీరు చేరుకుంది. నీటి సమస్యలు రాక ముందే అధికారులు గంగనాల ప్రాజెక్ట్ కాలవ లైనింగ్ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.7,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 20: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,700 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 58మంది రైతులు 773 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 12క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,700, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

బీఫార్మసీ పరీక్ష రుసుం గడువు

గణేశ్‌నగర్,మార్చ్ 20: ఎస్.యూ పరిధిలోని బి.ఫార్మసీ మూడు, ఐదవ సెమిస్టర్ (రెగ్యులర్‌సప్లిమెంటరీ), నాలుగు, ఆరో సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్ష రుసుం ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించడానికి 30వ తేదీ తుది గడువు అని 300/- ల అపరాధ రుసుం తో ఏప్రిల్ 3వ తేదీ లోపు చెల్లించాలని ఎస్ యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగ ప్రసాద్ తెలిపారు.పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నారు.

మద్యం కట్టడికి తనిఖీలు ముమ్మరం

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

కరీంనగర్ క్రైం, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అక్రమం మద్యం, గుడుంబా నిల్వ, సరఫరాలపై నిఘా పెట్టామని, అక్రమ మద్యంకు సంబంధించిన సమాచారాన్ని ఎక్సైజ్ శాఖ టోల్‌ఫ్రీ నెంబరు 1800-425-2523, కరీంనగర్ కంట్రోల్‌రూం 8019263862లకు సమాచారం అందించాలని కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. గుడుంబా నియంత్రణ కోసం గ్రామీణ ప్రాంతాలలో తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. మద్యం, గంజాయి, గుడుంబా అక్రమ దందాలను అరికట్టేందుకు విస్తృత దాడులు జరుపుతున్నామన్నారు. అనుమానితులను బైండోవర్ చేసి, మళ్లీ నేరాలకు పాల్పడితే తహసీల్దార్ వద్ద జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ పోలీసు శాఖలో ఇంటిలిజన్స్ టీంలను కూడా ఏర్పాటు చేశామన్నారు. తరచుగా వాహనాల తనిఖీలు, పెట్రోలింగ్ కుడా నిర్వహిస్తున్నామన్నారు.

నిలిపి ఉంచిన వ్యాన్ చక్రాలు చోరీ

శంకరపట్నం, మార్చి 20: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పక్కన నిలిచిన ఓ వ్యాన్ ముందు చక్రాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు ఎరడపల్లి గ్రామానికి చెందిన భూతం సంపత్ జీవనోపాధి కోసం తాడికల్ గ్రామంలో పాత ఇనుప సామాను వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున చూసేసరికి సుమారు రూ. 50వేల విలువ చేసే తన డీసీఎం వ్యాన్ ముందు చక్రాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పెట్రోలులో నీళ్లు వచ్చాయని ఆందోళన

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని భారత్ పెట్రోలు బంక్‌లో పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయని వాహనదారులు బుధవారం ఆందోళనకు దిగారు. బాధితుల కథనం మేరకు.. గుం డారంకు చెందిన ఇద్దరు తమ వాహనాల్లో పెట్రోలు అయిపోవడంతో బాటిళ్లలో తీసుకెళ్లేందుకు బంక్‌కు చేరుకున్నారు. బాటిళ్లలో పెట్రోలు పోయించుకుని వాహనం వద్దకు వెళ్లగా అడుగు భాగంలో నీళ్లలాగా కనిపించింది. దాంతో బంక్‌కు వెళ్లి నిర్వాహకులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆందోళనకు దిగారు. ఇదేమిటంటూ నిలదీశారు. కల్తీ పెట్రోలు వల్ల తమ వాహనాలు చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు బంకుల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెళ్లి విందులో పరస్పర దాడి

● కేసు నమోదు చేసిన పోలీసులు

మెట్‌పల్లి రూరల్, మార్చి, 20: మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని పెళ్లి విందులో జరిగిన పరస్పర దాడిలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన అమ్మాయికి వేములవాడకు చెందిన అబ్బాయితో కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ఘనంగా వివాహం జరిపించారు. అనంతరం జరిగిన విందులో అబ్బాయి తరుపున బంధువులకు భోజనం పెట్టడడం లేదని నిలదీశారు. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగి పలువురికి గాయలయ్యాయి. దీంతో అమ్మాయి తరుపు బంధువు దుద్దిళ్ల తిరుపతి అబ్బాయి తరుపు ఏడుగురిపై, అబ్బాయి తండ్రి నారాల రాజు అమ్మాయి తరుపు తొమ్మిది మందిపై ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేంపేటలో మద్యం పట్టివేత

మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన పల్లి శేఖర్‌గౌడ్ బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. 4లీటర్ల మద్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

గ్రామాల్లో పోషణ్ అభియాన్ ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కోనరావుపేట, మార్చి 20: కోనరావుపేట మండలం మట్టిమల్ల రెడ్డి తండాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, పిల్లలకు అందించాల్సిన పోషణ విలువలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత వంటి అంశాలపై సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగలక్ష్మీ, స్కూల్ టీచర్ కిషన్, అంగన్‌వాడీ టీచర్ సంతోష పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ప్రేరణ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

వేములవాడ టౌన్, మార్చి 20 : తెలంగాణ రాష్ట్ర కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ప్రేరణ పోటీలకు అగ్రహారం కామర్స్ విద్యార్థినులు ఎస్.భాగ్యలక్ష్మీ, శ్రావణి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వద్దూరి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను అభినందించారు. సికింద్రాబాద్‌లోని యానివర్సిటీ పీజీ కళాశాలలో శనివారం నిర్వహించే పోటీల్లో రంగోళి విభాగంలో పోటీపడ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



దర్శించుకుంటున్న జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి శివారులోని దుర్గామాత ఆలయంలో బుధవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా పురోహితులు రాచర్ల రఘురామశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. జడ్పీటీసీ లక్ష్మణ్ రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, దుర్గాదేవి మందిర కమిటీ, అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖర్

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని గరిపెల్లి ప్రణవి ప్రతిభ కనబర్చినట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. స్లోగన్ రైటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రణవిని అభినందించారు.

పుస్తెమట్టెలు అందజేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట పాల ఉత్పత్తిదారుడు కట్టి చిన్న పర్శరాములు- కనకవ్వ దంపతుల కూతురు పూజ వివాహం సందర్భంగా బుధవారం కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సంఘం సమకూర్చిన పుస్తెమట్టెలను స్థానిక సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరాజు, కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సత్తిరెడ్డి, మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చందుర్తి, మార్చి 20 : మండలంలోని బండపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు అధ్యయన ఉత్సవం, తొళ్లక్కం, చందన గోష్ఠి, ప్రసాద వితరణ, ప్రత్యేక పూజ కార్యక్రమాలను అర్చకులు శ్రీకాంత చార్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు మంజూరు చేయాలి

మెట్‌పల్లి రూరల్, మార్చి 20: మండలంలోని పలు గ్రామాల మీదుగా వేములవాడకు డబుల్ రోడ్‌ను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను నాయకులు కోరారు. బుధవారం మండలంలోని కోనరా వుపేట, కథలాపూర్ మండలంలోని గ్రామాలకు చెందిన నాయకులు ప్రభుత్వ విప్‌కు కలిసి సమస్యలను తెలుపుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ మండలంలోని దుంపేట నుంచి చింతకుంట, భూషణరావుపేట, ఊట్‌పల్లి, పెగ్గర్ల, మెట్‌పల్లి మండలంలోని కోనారావుపేట, రామారావుపల్లె గ్రామాల వీధుగా కోరుట్ల సమీపంలోని పెద్దగుండు వరకు డబుల్ రోడ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు నిర్మాణం జరిగితే ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాల వారు వేములవాడలోని రాజారాజేశ్వర స్వామికి దర్శనా నికి వెళ్లే వారికి దూరం తగ్గడమే కాకుండా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్‌కు వివరించి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. దీంతో రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని ఆది శ్రీనువాస్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆయా గ్రామాల్లోని నాయకులు జక్కని పరంధాములు, శేఖర్‌రెడ్డి, భూమరెడ్డి, గంగారెడ్డి, నవీన్, ఎస్‌యూ రెడ్డి, కిషాన్, రవి, రాజేందర్, తదితరలు ఉన్నారు.

సాయికుమార్ నియామకంపై హర్షం

కథలాపూర్, మార్చి 20 : రాష్ట్ర పారిశ్రామిక సహకార సంఘాల సమైఖ్య చైర్మన్‌గా మె ట్టు సాయికుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వుల జారీ చేయడంపై రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మన్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు. మత్స్య సహకార సంఘాల బలోపేతం కోసం మెట్టు సాయికుమార్ చేసిన కృషిని ప్ర భుత్వం గుర్తించడం గర్వించదగ్గ విషయమన్నారు. జగిత్యాల ఫిషర్‌మెన్ అధ్యక్షుడు రజినీకాంత్, వెల్గటూర్ మండల అధ్యక్షుడు గుమ్మల వెంకటేశ్, జగిత్యాల నియోజకవర్గ ఫిషర్‌మెన్ కార్యదర్శి గుమ్మల రాజేశ్ తదితరులు ఉన్నారు.

తుర్కకాశీకాలనీలో తాగునీటి గోస

- బోరుబావిలో అడుగంటిన నీళ్లు
- పట్టించుకోని అధికారులు

సిరిసిల్ల రూరల్, మార్చి 20 : వేసవి కాలం ప్రారంభంలోనే పలు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. మంచినీటి బోర్లలో నీళ్ల అడుగంటి పోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. పెద్దూర్ శివారులోని తుర్కకాశీకాలనీ వాసులు తాగునీటికి గోస పడుతున్నారు. కాలనీలో మంచినీటిని అందించే బోరు మోటారులో నీళ్ల లేకపోవడంతో పది రోజులనుంచి ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని 9వ వార్డు పెద్దూర్ శివారులో ఉన్న తుర్కాకాశీకాలనీలోని 120 కుటుంబాలు జీవిస్తున్నాయి. వారికి తాగునీటి కోసం గతంలో గ్రామపంచాయతీ ఉన్న సమయంలో రెండు బోర్లు వేసి మోటార్లను ఏర్పాటు చేశారు. ఆ బోర్లవద్దనే అక్కడి ప్రజలు నీటిని పట్టుకొని వినియోగించుకుంటున్నారు. కాలనీ మొదట ఉన్న ఇళ్ల వద్ద వేసిన బోరు మోటారులో నీళ్ల అడుగంటిపోవడంతో తాత్కాలికంగా నీటి అందించాలని ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నల్లాలు వారానికి ఒక్కసారి అదీ గంట మాత్రమే వస్తుంది. రోజు విడిచి రోజు కౌన్సిలర్ ఒక ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందించాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



నీళ్ల కోసం ఇబ్బంది పడుతున్న మహిళలు



ట్యాంకర్‌తో నీటి సరఫరా



నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం

- ఎస్‌కే మోరీబీ, తుర్కకాశీకాలనీ

తుర్కకాశీకాలనీలో నీరందించే బోర్ బావిలో నీళ్ల అడుగంటిపోయాయి. దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మరో బోరు వేయించాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు వెంటనే స్పందించాలి. నీటి సమస్యను పరిష్కరించాలి.



సమస్యను పరిష్కరిస్తాం

- లింగంపల్లి సత్యనారాయణ, కౌన్సిలర్

తొమ్మిదో వార్డు పరిధిలోని తుర్కాకాశీపల్లెలో తాగునీటి బోర్లకు మరమ్మతు చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ చైర్ పర్సన్‌తోపాటు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం మున్సిపల్ ట్యాంకర్‌ల ద్వారా నీటిని అందిస్తున్నాం. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 20 : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని, నేతన్నలకు నిత్యం ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ డిమాండ్ చేశారు. వేములవాడలో బుధవారం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి నెలకొన్న సంక్షోభంతో యాజమానులు పరిశ్రమలను బంద్ చేశారని, వాటిపై ఆధారపడిన మరమగ్గాల కార్మికులు, అనుబంధ రంగాలైన వార్పిన్, వైపని, జాఫర్లు, గుమాస్తలతోపాటు ఇతర కార్మికులకు ఉపాధి లేకపోయిందన్నారు. దీంతో పస్తులు ఉండే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బతుకమ్మ చీరలతోపాటు ప్రభుత్వ ఆర్డర్‌లను ఇప్పించాలని కోరారు. మూడు నెలలుగా ఉపాధి లేక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బతుకమ్మ చీరలు 2022-23 సంవత్సరానికి సంబంధించి పది శాతం యారన్ సబ్సిడీ డబ్బులను ఇప్పించాలన్నారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, సిరిమల్లసత్యం, నక్క దేవదాస్, గుండు రమేష్, ఉడుత రవి, ఆడెపు సంపత్, ఒగ్గు గణేష్, మోర తిరుపతి, సబ్బని చంద్రకాంత్, ఏలిగేటి శ్రీనివాస్, బెజుగం సురేష్ పాల్గొన్నారు.



ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సీసీ రోడ్డు పనులకు సర్వే

కోనరావుపేట, మార్చి 20: కోనరావుపేట మండలం మంగళపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం బుధవారం సర్వే చేపట్టారు. గ్రామస్థల ఇబ్బందుల దృష్ట్యా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో పనులు ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు బాదనేని బాలరాజు, అవురం సురేష్, సాసాల రాజిరెడ్డి, ఉప్పుల మల్లేశం తదితరులు ఉన్నారు.

పేదలను దోచి పెద్దలకు పంచుతున్న మోదీ సర్కార్

రాయికల్, మార్చి 20: కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ హయాంలో ఎక్కువగా రైతులు, యువకులు, రైతు కూలీలే నష్టపోయారని, ఈ ప్రభుత్వం పేదలను దోచి బడా వ్యాపారవేత్తలకు పంచి పెడుతోందని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో రైతులు కనీస మద్దతు ధరకు చట్ట బద్ధత కల్పించాలని ఆందోళన చేస్తే ఈ ఉద్యమాన్ని అణగదొక్కడానికి మోదీ సర్కార్ ప్రయత్నాలు చేస్తోందన్నారు. కేంద్రంలో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు కనీస మద్దతు ధర అందించి ఏకకాలంలో రూ.లక్ష రుణ మాఫీ చేసిందని గుర్తు చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టి ప్రజలకు అండగా ఉందన్నారు. పదేళ్ల ఎన్డీఏ సర్కార్ హయాంలో రైతులకు కనీస మద్దతు ధర ఎండమావిగానే మారిందని, రుణమాఫీ ఊసే లేదని, యువకుల కు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు హామీలకే పరిమితమైందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని, ధరలను అదుపులో పెట్టడంలో మోదీ సర్కార్ విఫలమైందన్నారు. రసాయనిక ఎరువుల ధరలను రెట్టింపు చేశారని, డీజిల్, పెట్రోల్ ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న మోదీ సర్కార్ తీరును ప్రతీ ఒక్కరు ఎండగట్టాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర అందివ్వలేదని, యువకులకు ఉద్యోగాల కల్పన ఎండమావిగానే మారిందని, ఉపాధిహామీ పథకంలో నిధుల కోత విధించి రైతు కూలీల పొట్టకొడుతున్నారని విమర్శించారు.

మహిళల రక్షణే షీ టీమ్ ప్రధాన లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది

వేములవాడ, మార్చి 20 : మహిళల రక్షణ షీ టీం ప్రధాన లక్ష్యమని జిల్లా షీ టీం పోలీస్ సిబ్బంది రమాదేవి, ప్రియాంక అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. నిందితులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు గురైనా, మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా, బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే షీ టీమ్ పోలీసుల దృష్టికి తీసుకురావాలని, వివరాలు గోప్యంగా ఉంచి చర్యలు తీసుకుంటామని అన్నారు. మహిళలు సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, వాటిలో ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే 8712656425 ఫోన్ నంబరుకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఉమా బాలచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

వల్లంపట్లలో బీరప్ప ఉత్సవాలు



ఎంపీపీని సన్మానిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

ఇల్లంతకుంట, మార్చి 20: మండలంలోని వల్లంపట్లలో బీరప్పకామరావతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఎంపీపీ వుట్కూరి వెంకట రమణారెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం గొల్ల కుర్మల సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీపీని ఆలయకమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య ఎంపీటీసీ నాయిని స్రవంతిరమేష్, మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్, నాయకులు నాయిని శ్రీనివాస్, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎలుక అనీల్, నక్క రవి, యాస తిరుపతి, మాధవరెడ్డి, లెంకల రాజు, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

మల్లాపూర్, మార్చి, 20: మండలంలోని రాఘవపేట వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి పురోహితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, సరోజన దంపతులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాజీరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకలు, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యంలో యువత పాత్ర కీలకం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, మార్చి 20: యువత సమాజ చైతన్యంలో కీలక భూమిక పోషించి, సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను పారద్రోలడానికి కంకణ బద్ధులు కావాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. బుధవారం మండలంలోని భూషణరావుపేటలో కెఎంపీఎల్ 2 మండల స్థాయి క్రికెట్ టోర్నీ ఎన్ఆర్ఐ బైర్ దేవ్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పల్లెల్లో పనుల్లో అలసటను మరిచిపోవడానికి నాటకాలు, జానపదాలతో కాలక్షేపం చేసేవారన్నారు. ప్రస్తుతం గ్రామీణ క్రీడలపై యువత ఆసక్తి కనబరుస్తోందన్నా రు. ప్రధానంగా క్రికెట్ పట్ల క్రేజ్ పెరిగిన నేపథ్యంలో యువత పోటీల్లో అధికంగా పాల్గొంటున్నారన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక ధారుడ్యంను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. క్రికెట్ మైదానం కోసం స్థలం కేటాయించాలని పలువురు నాయకులు, క్రీడాకారులు కోరగా తప్పకుండా సర్వేలు చేసి స్థలం కేటాయించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మినీ స్టేడియం చేసి క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పిస్తానన్నారు. యువత సన్మార్గంలో నడవాలని గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దని హితవు పలికారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజికసేవా కార్యక్రమాలు ముమ్మరంగా కొనసా గించి మంచిపేరు సంపాదించాలని కోరారు. పల్లెల్లో యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి పెడదారినపడకుండా చూడాలని సూచించారు. అనంతరం దూలూరులో రైస్‌మిల్లును ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అం జయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అ ధ్యక్షుడు ఎండీ అజీం, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, మండల రైతుసంఘ నాయకుడు గడ్డం భూమారెడ్డి, స్వామిరెడ్డి, వాకిటి రాజరెడ్డి, చిన్నారె డ్డి, చెదలు సత్యనారాయణ, బైర మల్లేశం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



భూషణరావుపేటలో క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

అభివృద్ధి పనులతోనే కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కోనరావుపేట, మార్చి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు పెరుగుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెంకటరావుపేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసించారని, కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. అందుకే ఆ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మంతెన మల్లేశం, పెద్ద మల్లేశం, రామస్వామి, రాజేశం, శంకర్, రవీందర్, దేవయ్య ఉన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, ఫిరోజ్ బాషా, పల్లె రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పార్టీని మరింతం బలోపేతం చేయాలి

సిరిసిల్ల టౌన్: కాంగ్రెస్ పార్టీని పట్టణంలో మరింత బలోపేతం చేయాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో సిరిసిల్ల మున్సిపల్ 13వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ జాగీరు శైలు, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ బీఆర్ఎస్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకోసం పాటు పడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న గ్యారెంటీలను గడప గడపకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కార్యదర్శి కాసర్ల రాజు, నాయకులు వైద్య శివప్రసాద్, భీమవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి